TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

2


విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...


సంపుటి : 1 సంచిక :117 prajadivvs57@gmail. com సోమవారం , ఫిబ్రవరి-23, 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-



## మావోయిస్టు అగ్రనేత
# దేవ్‌జీ లొంగుబాటు

### మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్‌తో పాటు మరో 20 మంది సరెండర్ !

మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అగ్రనేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నర్సింహారెడ్డి అలియాస్ గంగన్నతోపాటు సుమారు 20 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు సమాచారం. ఆసిఫాబాద్ అడవుల్లో పోలీసుల ఎదుట వారు లొంగిపోయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. దేవ్‌జీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టు పార్టీకి ఆయన నాయకత్వం వహిస్తున్నారు.

## తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో
# SIR జాబితా

2

ప్రకటించిన ఎన్నికల సంఘం




## వివాదాలు వద్దు...
# పరిష్కారాలకే ప్రాధాన్యత

### రెండు మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం

కాళేశ్వరం నుండి నీటి చుక్క లేకున్నా వరి పంటలో రికార్డు సృష్టించాం

కాళేశ్వరం గొప్ప ప్రాజెక్ట్ అనుకునేలోపే కుప్పకూలింది

ఎలాంటి భేషజాలకు పోకుండా పక్క రాష్ట్రాలతో చర్చిస్తాం

ప్రజలు శిక్షించినా బుద్ధి మార్చుకోని బిఆర్ఎస్

రాజకీయ రంగు పులుముకున్న గోదావరి జలాలు

దేవాదుల ఎత్తిపోతలను సందర్శించిన సీఎం రేవంత్

గడచిన 10 ఏళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ప్రస్తుతం వివాదాలు వచ్చేవి కాదు

కాళేశ్వరం నుండి నీటి చుక్క లేకున్నా అత్యధికంగా వరి దిగుబడి సాధించాం

ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని చెప్పారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే ఇప్పుడు ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదమే ఉండేది కాదని తెలిపారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. మిగిలిన ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు మిగతా ప్రాజెక్టులకు, భూసేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఏర్పడింది. అయినా కఠిన పరిస్థితులు అన్నీ అధిగమించి వచ్చే రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రూ.6



వేల కోట్ల అంచనాలతో మొదలుపెట్టిన దేవాదుల ప్రాజెక్టు ఇవాళ రూ.18 వేల కోట్లు అవసరమైన స్థితికి చేరుకున్నది. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. తెలంగాణలోని ప్రతీ ఎకరాకు నీరందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**రాష్ట్రంలో అత్యధికంగా వరి దిగుబడి**

తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడినప్పుడు పరిస్థితి బాగానే ఉండింది. నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నాయి. పదేళ్ల బీఆర్ఎస్ నేతల స్వార్థ రాజకీయంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కమీషన్ల కోసం ఒకే ఒక్క ప్రాజెక్టు మీద లక్ష కోట్లు ఖర్చుచేసి మొత్తం రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ గాలికి వదిలేశారు. లక్ష కోట్లు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టు గొప్పది అనుకునేలోపే కుప్పకూలింది. కాళేశ్వరం కింద నీరు ఎత్తిపోయనప్పటికీ రాష్ట్రంలోనే అత్యధికంగా ..మిగతా 2లో



బిజెపికి బానిసలుగా
# జగన్, చంద్రబాబు

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల

మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా

చంద్రబాబుది అధికారిక పాత్ర కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ

రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అంటూ కొత్త నిర్వచనం

రైతుల కోసం కాంగ్రెస్ నిరసన చేస్తుంటే ఉగ్రకోణం అంటారా అని ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో ..మిగతా 2లో

# ఏపీలో డిజిటల్ విప్లవానికి బాటలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం

ప్రాజెక్టు అమలుకు రూ. 2,432 కోట్లు విడుదల చేయనున్న కేంద్రం

సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్

రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు




2

## ఏపీలో పెట్టుబడులకు
# అపార అవకాశాలు

### చంద్రబాబుతో డైనమాటిక్ టెక్నాలజీస్ ప్రతినిధుల భేటీ

ఏవియేషన్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులపై చర్చలు

అవకాశాలు, విధానాలను వివరించిన సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రముఖ సంస్థ డైనమాటిక్ టెక్నాలజీస్ ఆసక్తి కనబరిచింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆయన క్యాంపు కార్యాలయంలో ..మిగతా 2లో





## మూసి ప్రాజెక్టుకు...
## డిపిఆర్, ఎఫ్‌టిఎల్ లేకుండా
# నోటీసులు ఎలా ఇస్తారు?


### మధు పార్క్ బాధితులతో బిఆర్ఎస్ నేతల భేటీ

నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

బాధితులను పరామర్శించిన హరీష్ రావు

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రభావంతో నోటీసులు అందుకున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ నివాసితులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి,హరీష్ రావుతో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి,మాధవరం కృష్ణారావు తదితరులు బాధిత కుటుంబాలతో ఆదివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మూసీ శుద్ధి, అభివృద్ధికి తమకు వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. అయితే ప్రాజెక్టు పేరుతో మధ్యతరగతి, పేదల ఇండ్లను కూల్చడం సమంజసం కాదని ..మిగతా 2లో

## బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
# అరెస్ట్



బాన్సువాడ పర్యటనను అడ్డుకున్న పోలీసులు

2


భూ వివాదంపై కామారెడ్డిలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ


ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు బీజేపీ నేతల అరెస్ట్

## వేగవంతమైన మెట్రోను
# ప్రారంభించిన ప్రధాని

### ఢిల్లీ-మీరట్ కారిడార్ లో 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించ నున్న మెట్రో

దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ ..మిగతా 2లో





## ఏఐ సదస్సులో... ప్రపంచానికి చాటిన
# యువత ప్రతిభ

ప్రపంచ నేతలను ఆశ్చర్యపరచిన కే ఐ ఆవిష్కరణలు

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల ముగిసిన 'ఏఐ ఇంపాక్ట్' సదస్సుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. దీని ద్వారా కృత్రిమ మేధ రంగంలో భారతదేశ అద్భుతమైన సామర్థ్యాలను ప్రపంచానికి చూపించామని అన్నారు. ఆదివారం 131వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిన ..మిగతా 2లో

# ఏపీలో డిజిటల్ విప్లవానికి బాటలు

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం**

**ప్రాజెక్టు అమలుకు రూ. 2,432 కోట్లు విడుదల చేయనున్న కేంద్రం**

**సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్**

**రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు**

ఏపీ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పనులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలను విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్ట్ ను రాష్ట్రంలో సమర్థంగా అమలు చేసేందుకు ఇరు ప్రభుత్వాల మధ్య ఒక ముఖ్యమైన సహకార ఒప్పందం కుదిరింది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ. 2,432 కోట్ల నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సుమారు 5 లక్షల కుటుంబాలకు ఫైబర్ కనెక్షన్ల ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించడం. దీని అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చనున్నాయి కేంద్రం తరఫున డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13,426 గ్రామ పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను విస్తరించనున్నారు. ఇందులో భాగంగా, ఇప్పటికే ఫేజ్-× కింద ఉన్న 1,692 పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తారు. అలాగే, ఫేజ్-×× కింద 11,254 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పనులను పూర్తి చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు. వీటికి అదనంగా, స్థానిక అవసరాలు, డిమాండ్‌ను బట్టి 3,942 గ్రామాల్లో లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రాజెక్టు సజావుగా సాగేందుకు అవసరమైన రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. గ్రామాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలు మరింత పటిష్టంగా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఒప్పందం గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విప్లవానికి బాటలు వేస్తుందని, సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## పెట్టుబడిదారుల రాకను దెబ్బతీస్తున్న జగన్

**గతంలో జగన్ తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టిన లోకేశ్**

**కపట ప్రేమతో ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ విమర్శలు**

కాంగ్రెస్ నిరసనపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసిన జగన్ ఇప్పుడు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడటం కపట ప్రేమను ప్రదర్శించడమేనని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పోస్టు పెట్టారు. ఢిల్లీ ఏఐ సదస్సులో జరిగిన నిరసన దేశానికి తలవంపులు తెచ్చిందని, రాజకీయ విభేదాలున్నా ప్రపంచ వేదికపై దేశ గౌరవాన్ని కించపరచవద్దని జగన్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన లోకేశ్, జగన్ గతాన్ని గుర్తు చేస్తూ పలు ఆరోపణలు చేశారు. 'భారత్‌లో పెట్టుబడుల వాతావరణానికి అందరికంటే ఎక్కువ నష్టం కలిగించిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు. ఈ కపటత్వం ఆశ్చర్యం కలిగిస్తోందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ఏకరువు పెట్టారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సును అడ్డుకునేందుకు విమానాశ్రయంలో ధర్నా చేశారు. 2019లో అంతర్జాతీయ పెట్టుబడిదారులతో కుదిరిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టాల్సిన పెట్టుబడులను అడ్డుకున్నారు. 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను నిలిపివేయాలని ఆర్‌బీఐకి లేఖ రాశారు. ఇప్పుడు 2026లో ఏఐ సదస్సు ఘటనపై ఆందోళన చెందుతున్నట్టు నటిస్తున్నారని లోకేశ్ విమర్శించారు.

## ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు

**మొదటి పేజీ తరువాయి...**

సమావేశమయ్యారు. డైనమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఛైర్మన్ ఉదయంత్ మల్హోత్రా నేతృత్వంలోని బృందం ఈ భేటీలో పాల్గొంది. ఈ సందర్భంగా ఏవియేషన్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో తమ సంస్థ కార్యకలాపాలు, అనుభవాన్ని వివరిస్తూ ప్రతినిధులు సీఎంకు ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యంగా రక్షణ రంగంలో తమకున్న నైపుణ్యాన్ని వారు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను, విధానాలను వారికి తెలిపారు. ఈ సమావేశంలో డైనమాటిక్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి. చలపతి, డైరెక్టర్ అహిల్యా మల్హోత్రా, సీఈఓ ఆండ్రియా మిలానీ, యూరప్ కార్యకలాపాల సీనియర్ ఎగ్జిక్యూటివ్ క్రిస్టినా లిడేగార్డ్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## వేగవంతమైన మెట్రోను ప్రారంభించిన ప్రధాని

**మొదటి పేజీ తరువాయి...**

మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్‌ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

## బిజెపికి బానిసలుగా మారిన జగన్, చంద్రబాబు

**మొదటి పేజీ తరువాయి...**

విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా. కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోక పోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యాఖ్యానించారు.

## బీజేపీ చీఫ్ రాంచందర్ రావు అరెస్ట్

**బాన్సువాడ పర్యటనను అడ్డుకున్న పోలీసులు**

**భూ వివాదంపై కామారెడ్డిలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ**

**ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు బీజేపీ నేతల అరెస్ట్**

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును పోలీసులు ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డిలో నిన్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగిన నేపథ్యంలో, ఆయన అక్కడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. బాధితులను పరామర్శించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కామారెడ్డి, బాన్సువాడ పర్యటనకు ఆయన సిద్ధమవుతున్న సమయంలో ఇంటివద్దే నిర్బంధించారు. శనివారం కామారెడ్డిలో భూ వివాదానికి సంబంధించిన ఆరోపణలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిపై కాంగ్రెస్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ భూ కబ్జా ఆరోపణలు చేయడంతో వివాదం మొదలైంది. ఈ ఆరోపణలను నిరూపించాలంటూ ఎమ్మెల్యే సవాల్ విసరడంతో ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా నిరసనలకు దిగారు. ఈ క్రమంలో బీజేపీ ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవడంతో ఘర్షణ చెలరేగింది. ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నేత కారును ధ్వంసం చేసి, దాడికి పాల్పడ్డారు. పరిస్థితి చేయిదాటడంతో పోలీసులు రంగప్రవేశం చేసి, లాఠీఛార్జ్ చేసి గుంపును చెదరగొట్టారు. ఇరువర్గాలకు చెందిన పలువురిని అరెస్టు చేయడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాంచందర్ రావు పర్యటన ఉద్రిక్తతలను మరింత పెంచుతుందని భావించిన పోలీసులు, ఆయన్ను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్టు చేశారు. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో SIR జాబితా

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం తొమ్మిది రాష్ట్రాలు, 1.70 కోట్లకుపైగా ఓటర్లను ఈసీ తొలగించింది. గతేడాది అక్టోబరులో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి మునుపు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 21.45 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ప్రచురించిన తుది ఓటరు జాబితాలో ఓటర్ల సంఖ్య 19.75 కోట్లకు తగ్గింది. అంటే ఓటర్ల సంఖ్యలో 7.93శాతం తగ్గుదల నమోదైంది. గుజరాత్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, గోవా, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్‌కు చెందిన తుది ఓటరు జాబితాలను ఈసీ గతవారం విడుదలు చేసింది. వాటిని విశ్లేషించగా ఈ గణాంకాలు బయటపడ్డాయి. ఓటరు జాబితాల నుంచి అనర్హులను తొలగించాలన్న లక్ష్యంతో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఈసీ శ్రీకారం చుట్టింది. తొలుత బిహార్‌లో ఈ ప్రక్రియను చేపట్టింది. ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ కొనసాగుతోంది.

**గుజరాత్‌లో అత్యధికం- కేరళలో అత్యల్పం**

ఇక అత్యధిక తగ్గుదల గుజరాత్ రాష్ట్రంలో ఉంది. ఓటర్ల జాబితాలో నుంచి 68.12 లక్షల పేర్లు తొలగించారు. దీంతో అక్కడ ఓటర్ల సంఖ్య 5.08 కోట్ల నుంచి 4.40 కోట్లకు చేరుకుంది. అంటే 13.4 శాతం తగ్గింది.

మధ్యప్రదేశ్‌లో ఓటర్ల జాబితా నుంచి 34.35 లక్షల పేర్లు తొలగించారు. ఆ రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 5.74 కోట్ల నుంచి 5.39 కోట్లకు చేరింది. అంటే 5.96శాతం తగ్గుదల నమోదైంది.

రాజస్థాన్‌లో 31.36 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 5.46 కోట్ల నుంచి 5.15 కోట్లకు చేరింది. అంటే 5.74శాతం తగ్గుదల నమోదైంది.

ఛత్తీస్‌గఢ్‌లో ఓటర్ల జాబితా నుంచి 24.99 లక్షల పేర్లను తొలగించారు. ఓటర్ల సంఖ్య 2.12 కోట్ల నుంచి 1.87 కోట్లకు చేరుకుంది. 11.77 శాతం తగ్గుదల నమోదైంది.

కేరలో అత్యల్పంగా పేర్లను తొలగించారు. ఓటర్ల జాబితా నుంచి 8.97 లక్షల పేర్లు తొలగించారు. 3.22 శాతం తగ్గుదల నమోదై ఓటర్ల సంఖ్య 2.78 కోట్ల నుంచి 2.69 కోట్లకు చేరింది.

గోవాలో 1.27 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారు. అంటే 10.7శాతం తగ్గుదల నమోదైంది.

కేంద్రపాలిత ప్రాంతాలైన

అండమాన్ అండ్ నికోబార్‌లో అత్యధిక శాతం తగ్గుదల నమోదైంది. 52,364 పేర్లు తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3.10 లక్షల నుంచి 2.58 లక్షలకు చేరుకుంది. అంటే 16.87 శాతం ఓటర్లు తగ్గారు.

పుదుచ్చేరిలో 77,367 ఓటర్ల పేర్లను తొలగించారు. దీంతో 7.5శాతం ఓటర్లు తగ్గారు.

లక్షద్వీప్‌లో కేవలం 206 పేర్లను మాత్రమే తొలగించారు. అంటే 0.36శాతం ఓటర్లు తగ్గారు.

**ఇప్పటి వరకు 2.16 కోట్ల ఓటర్లు తొలగింపు**

అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన గణాంకాలను కూడా కలుపుకుంటే మొత్తం తొలగింపుల సంఖ్య 2.16 కోట్లకు చేరాయి. అంటే 7.37 శాతం మంది ఓటర్ల పేర్లు తొలగించారు. బిహార్‌లో 2025 జూన్‌లో 7.89 కోట్ల ఓటర్లు ఉన్నారు. సెప్టెంబర్ 2025లో 7.43 కోట్లకు తగ్గుదల

**ఇంకా విడుదల కావాల్సిన రాష్ట్రాలు**

తమిళనాడు, బంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల ఓటర్ల జాబితా ఇంకా పూర్తిగా విడుదల కాలేదు. తమిళనాడు తుది జాబితా సోమవారం విడుదల కానుంది. బంగాల్‌లో దశలవారీగా విడుదల అవుతుంది. ఉత్తరప్రదేశ్ ఏప్రిల్ 6న తన జాబితాను విడుదల చేస్తారు.

**అసోంలో ప్రత్యేక సవరణ**

ఇక అసోంలో ఎస్ఐఆర్ బదులుగా స్పెషల్ రివిజన్‌ను చేపట్టారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 10న పూర్తి అయ్యింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో 2.45 కోట్ల ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితాలో 2.52 కోట్లు కాగా, తుది జాబితాలో 2.49 కోట్ల ఓటర్లు ఉన్నారు.



## వివాదాలు వద్దు... పరిష్కారాలకే ప్రాధాన్యత

**మొదటి పేజీ తరువాయి...**

వరి దిగుబడి వస్తోంది. కృష్ణా జలాల తరలింపుపై అసెంబ్లీలో క్లారిటీ ఇచ్చాం. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో సుదీర్ఘంగా చర్చించాం. బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పులను, పాలకులు చేసిన నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించాం. కేసీఆర్, హరీష్ రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారు. అన్ని మొట్టికాయలు వేసేలా మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**బీఆర్ఎస్ నేతలకు సవాల్..**

ఇప్పుడు మళ్లీ సవాల్ చేస్తున్నాను. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వారేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశారో సభలోనే చర్చిద్దాం. ఎవరేం చేశారో నిండు సభలో ప్రజలకు వివరిద్దాం. విమర్శలు, ప్రతి విమర్శలు వద్దు అనుకున్నా ఓకే. పదేళ్ల అనుభవంతో వాళ్లు సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తాం. అంతిమంగా అందరం కలిసి రాష్ట్రానికి మేలు చేసేలా కృషి చేద్దాం. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం. ప్రజలు, తెలంగాణ నీళ్ల విషయంలో అందరం కలిసిగట్టుగా ఉందాం. కృష్ణా జలాల విషయంలో తాము ఏపీకి సహకరిస్తున్నామనేది పచ్చి అబద్ధం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇచ్చారు.

## ఏఐ సదస్సులో... ప్రపంచానికి చాటిన యువత ప్రతిభ

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సదస్సు ప్రపంచ దేశాలను ఆకర్షించిందని అన్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా మన రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలను ఆశ్చర్యపరిచాయని తెలిపారు. జంతువుల చికిత్సకు వాటిని ట్రాక్ చేయడానికి 'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

**సైబర్ నేరాలపై హెచ్చరిక**

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

## మూసి ప్రాజెక్టుకు... డిపిఆర్, ఎఫ్‌టిఎల్ లేకుండా

**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) స్పష్టత, పర్యావరణ అనుమతులు, సామాజిక ప్రభావ అంచనా లేకుండానే నోటీసులు ఇవ్వడం చట్టబద్ధం అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కు జారీ చేసిన నోటీసులను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.

## కేసీఆర్ కంటే.. రేవంత్ రెడ్డి డేంజరస్

**రాష్ట్రంలో రేవంతుద్దీన్ అరాచక పాలన**

**కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులపై ఎంపీ ధర్మపురి అర్వింద్**

కామారెడ్డి జిల్లాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హౌజ్ అరెస్టులతో బీజేపీ నేతలను అణిచివేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో రేవంతుద్దీన్ అరాచక పాలన నడుస్తోందని విమర్శించారు. హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేపై దాడి జరిగి రెండ్రోజులు అవుతున్నా, ఇప్పటివరకు స్పీకర్ ఆరా తీయకపోవడం దారుణమన్నారు. కేవలం 15 శాతం ఓట్ల కోసం ఎంఐఎంకు కాంగ్రెస్ నేతలు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కంటే, రేవంత్ రెడ్డి వెరీ డేంజరస్ సీఎం అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కూడా పేర్లు మార్చుకోవాలని హితవు పలికారు. శ్రీధర్ బాబు.. శ్రీధర్ బాబాగా, భట్టి విక్రమార్క భట్టి అక్రమ్‌గా మార్చుకోవాలని సూచించారు. అంతకుముందు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. కామారెడ్డిలో శనివారం జరిగింది ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందన్నారు. తనను అడ్డు కోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తున్నారని, రేపటి నుంచే గ్రామాల్లోకి వెళ్తా ఎలా అడ్డుకుంటారో చూస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ పోటీ చేసి ఓడిపోయినప్పటికీ అభివృద్ధి విషయంలో ఆయనకు స్వాగతం పలుకుతానన్నారు. కాలేజీ భూముల విషయంలో తనపై చేసిన ఆరోపణలను నిరూపించడానికి కాంగ్రెస్ నాయకులు రావాలని, సోమవారం నేనే కలెక్టరేట్‌కు వస్తానన్నారు. అక్కడ కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్‌లు కూడా ఉంటారన్నారు. వారి సమక్షంలోనే ఆధారాలను తీసుకువచ్చి నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానన్నారు.

# రచయిత బొగ్గుల శ్రీనివాస్ కేసులో ట్విస్ట్

## - సుపారీ హత్యేనని తేల్చిన పోలీసులు





**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22( వెలుగు నిఘా )**రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసును ఖమ్మం పోలీసులు ఛేదించారు. ఆర్థిక లావాదేవీలే కారణమంటూ నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లుగా పోలీసులు తెలిపారు.ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ మృతి కేసులో ఊహించనిట్విస్ట్ చోటుచేసుకుంది. అతడిది సాధారణ మరణం కాదని, పక్కాగా ప్లాన్ చేసిన సుపారీ హత్య అని ఖమ్మం పోలీసులు నిర్ధారించారు. బొగ్గుల శ్రీనివాస్ హత్యకు ప్రధాన కారణం ఆర్థిక లావాదేవీలేనని స్పష్టం చేశారు. నిందితులు శ్రీనివాస్ ను హతమార్చిన తర్వాత, ఆ మృతదేహాన్ని పాలేరు రిజర్వాయర్లో పడేశారని పేర్కొన్నారు. అయితే ఈ మొత్తం తతంగాన్ని ఓ కారు ప్రమాదంగా చిత్రీకరించి పోలీసులను, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు విఫలయత్నం చేసినట్లుగా దర్యాప్తులో తేలింది.నలుగురు నిందితులు అరెస్ట్..ఈ హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడు వేణుమాధవ రెడ్డి తో సహా నలుగురిని కూసుమంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇక బొగ్గుల శ్రీనివాస్ గతంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై ఒక పుస్తకాన్ని రచించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన హత్యకు ఈ పుస్తకానికి ఎలాంటి సంబంధం లేదని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక పరమైన గొడవలే శ్రీనివాస్ హత్యకు దారితీశాయని ఆయన క్లారిటీ ఇచ్చారు.

# డిష్ కేబుల్ కోసం కరెంట్ స్తంభాలు..

## చోద్యం చూస్తున్న కరెంట్ అధికారులు



**గొల్లపల్లి ఫిబ్రవరి 22 (వెలుగు నిఘా)** శంకర్ రావుపేట్ గ్రామంలో కరెంట్ స్తంభాలు డిష్ కేబుల్ గురించి వేసినట్టు అనిపిస్తుంది. మర్రి దగ్గర ఉన్న కరెంట్ స్తంభాల కు కరెంట్ వైర్ల పైనుండి డిష్ కేబుల్ ఉండడం గమనార్ధం. కరెంట్ అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదు. అధికారులు డిష్ కేబుల్ ఆపరేటర్లు మద్దతు ఇవ్వడం జరుగుతుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కరెంట్ స్తంభాల కు డిష్ కేబుల్ తొలగించాలని అధికారులను ఆదేశించారు. కానీ విద్యుత్ అధికారులు కరెంట్ వైర్ల పైనుండి డిష్ కేబుల్ ఉన్న అధికారుల స్పందించడం లేదు అని గ్రామస్థులు పేర్కొన్నారు

# టెన్త్ పూర్వ విద్యార్థుల (1985-86) అపూర్వ సమ్మేళనం



**హుజూర్ నగర్; ఫిబ్రవరి 22 (వెలుగు నిఘా)** మండల కేంద్రమైన మఠంపల్లి లోని వివి హైస్కూల్లో 1985 - 86 లో 10వ తరగతి( బి సెక్షన్) చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం మండలంలోని బక్కమంతుల గూడెంలో గల మామిడి తోటలో ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి పూర్వ విద్యార్థులంతా కలుసుకొని ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాటి పూర్వ విద్యార్థులు బేత కోటమ్మ ప్రతాప్ రెడ్డి, గొలమారి ఇన్నాశమ్మ, గోపు విజయ మేరీ, టెక్లా రాణి, సోములమ్మ, వాణిశ్రీ, మంగమ్మ, చంద్రకళ, బోయపాటి ఫాతిమా, గోపు మేరీ, సుజాన, థెరిస్సా, ఆర్ విజయ, రమణ, పద్మ, జానకమ్మ, తాటికొండ సత్యనారాయణ రెడ్డి, కిష్టపాటి వెంకట రెడ్డి, బచ్చలకూరి సామెల్, పొదిల రాజు, రావిరాల జ్వానెస్, కామిశెట్టి రవికుమార్, పశ్య సుధాకర్ రెడ్డి, పశ్య జగన్ మోహన్ రెడ్డి, నంద్యాల అప్పిరెడ్డి, రామకృష్ణారెడ్డి, బోనాల లక్ష్మీ నారాయణ, మీరా సాహెబ్, అంజయ్య,రామకృష్ణారెడ్డి, ముప్పారపు వెంకటేశ్వర్లు, నగేష్, శంభయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి.





**గొల్లపల్లి , ఫిబ్రవరి 22 (వెలుగు నిఘా)** గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్,ఆధ్వర్యంలో గౌరవ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమాన్ని ప్రతి ఆదివారం నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా గొల్లపెల్లి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, విగ్రహానికి పువ్వుల మాల వేసి నివాళిలు అర్పించారు.ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ మనకు చేసిన సేవలను స్మరించుకోవడం ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి. కల్లు కాదు ముఖ్యం కలం ముఖ్యం యువత ముందుండి విద్య ఉద్యోగుల్లో పోటీపడాలి.యువత చెడు అలవాట్లకు చెడు ఆలోచనలకు లోని కాకుండా నేటి యువత దేశానికి ఆదర్శ నిలవాలి. మండలంలోని యువత అంబేద్కర్ ను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి మన భారతీయుడైన అంబేద్కర్ ప్రపంచ దేశాలే గౌరవిస్తున్నాయంటే ఆయన ఎంతటి మహనీయుడు అందరూ తెలుసుకోవాలి అన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువతకు గ్రామస్తులకు ఎస్ఐ కృష్ణ సాగర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐదో వార్డ్ సభ్యుడు సంగెం కళ్యాణ్, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ తిరుపతి, బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు జేరిపోతుల కొమరయ్య, సామాజిక సేవ కార్యకర్త సాతర్ల లక్ష్మణ్,తుడుం దుర్గయ్య,తుడుం లింగయ్య, సుద్దాల రాజలింగు, సిరికొండ వెంకటేష్,చెవులమద్ది రాజయ్య,చెవులమద్ది రాజలింగు,జేరిపోతుల అనిల్,ఏలు ఏల రాము, సురేష్, మనుపటి రమేష్, ఎనగందుల సాయి,జక్కుల గంగాధర్, బోడపట్ల రాజకుమార్, సంగెం హరీష్, రంగా,సంతోష్ తదితరులు

# వార్డుల్లో తిరగండి.. సమస్యలు తీర్చండి!

**వారంలో ఐదు రోజులు.. రోజుకు రెండు గంటలు ప్రజల్లో ఉండాల్సిందే**

**ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే 'రోల్ మోడల్'గా తీర్చిదిద్దుతాం**

**కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి దిశానిర్దేశం**

**మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనిత బాధ్యతలు స్వీకరణ**







**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22 ( వెలుగు నిఘా )**
ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా ప్రజా ప్రభుత్వం తరపున పేదవాడికి సేవ చేయాల్సిందే. పదవి అనేది అధికారం కాదు, బాధ్యత అని గుర్తించాలి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏదులాపురం నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**ఫీల్డ్ లో ఉంటేనే వ్యవస్థ బాగుపడుతుంది**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి నూతన ప్రజాప్రతినిధులకు తనదైన శైలిలో దిశానిర్దేశం చేశారు. ప్రజలు నమ్మి ఓటేశారని, కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. "ప్రతి కౌన్సిలర్ వారంలో ఐదు రోజులు, ఉదయం పూట రెండు గంటలు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలి. ప్రతి పనికి నిధులు అవసరం లేదు, మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుంది" అని ఆదేశాలు జారీ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని, తాగునీటి సమస్యలు, మురికినీరు నిలవకుండా చూడటం, నాలాల కబ్జాలను అడ్డుకోవడంపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ప్రతి వార్డు సమస్యపై కౌన్సిలర్లకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇంటి వేడుకలో ఆత్మీయత**

అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపి, ఆత్మీయంగా పట్టు వస్త్రాలను కానుకగా అందించారు. పేదల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ , కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హమాలీల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదాం

- రక్షణ లేని హమాలి జీవితాలు
- సమగ్ర చట్టం సాధనకు ఉద్యమిద్దాం
- ప్రమాద బీమా ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలి
- గోమాస ప్రకాష్

**హమాలి సంఘం సిఐటియు జిల్లా అధ్యక్షులు**



**రామకృష్ణాపూర్ ఫిబ్రవరి 22 వెలుగు నిఘా ప్రతినిధి** మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపెల్లి గ్రామం లోని హమాలీల జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ శెట్టి శంకరయ్య అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో కామ్రేడ్ గోమాస ప్రకాష్ హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని రకాల హమాలీల రక్షణకై సమగ్ర చట్టం చేయాలని, ప్రమాద బీమా పి ఎఫ్, ఇ ఎస్ ఐ సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కామ్రేడ్ గోమాస ప్రకాష్, అధ్యక్షులుగా శట్టి శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా గోలెం మల్లేష్, కోశాధికారిగా పెద్దపెల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులు గా వై రవీందర్, సహాయ కార్యదర్శిగా పెంట రమేష్, కమిటీ సభ్యులుగా పెద్దపల్లి ఓదెలు ,మామిడాల వెంకటేష్ లను ఎన్నుకోవడం జరిగింది

# కృష్ణవేణి హై స్కూల్‌లో బేస్‌లైన్ పరీక్షలు

**ధర్మారం, ఫిబ్రవరి 22 (వెలుగు నిఘా):** ధర్మారం మండల కేంద్రంలోని కృష్ణవేణి హై స్కూల్ లో ఆదివారం ఓపెన్ ఇంటర్, ఓపెన్ టెన్త్ బేస్ లైన్ లెవెల్ పరీక్షలు నిర్వహించినట్లు ఓపెన్ టెన్త్ ఇంటర్ కోఆర్డినేటర్ పాఠశాల ప్రిన్సిపల్ వడ్లూరి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ బేస్ లైన్ లెవెల్ పరీక్షలు ఆన్లైన్ ద్వారా చరవాణిలో రాసినట్లు ఆయన తెలిపారు. అనివార్య కారణాలవల్ల మధ్యలో చదువు మానేసిన అనేక మంది పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదవలేక ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని, ఇందులో భాగంగా బేస్ లైన్ లెవెల్ పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. చివరి పరీక్షలు ఏప్రిల్ మాసంలో పెద్దపల్లిలో ఉంటాయని, ఇందుకోసం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నట్లు ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ తెలిపారు.





# అటల్ జీ కు అక్షర నీరాజనం కార్యక్రమం విజయవంతం చేయండి

**- గుండా ఉపేందర్ రెడ్డి**

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22 ( వెలుగు నిఘా )** మార్చి 1 వ తేదీన ఖమ్మం లో ఎస్ ఆర్ గార్డెన్ యందు భారత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజ్ పాయ్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అటల్ జీ కు అక్షర నీరాజనం కార్యక్రమం ఉత్సవ కమిటీ అధ్యక్షులు దుద్దుకూరి కోటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి మండడపు ప్రభాకర్ రెడ్డి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమం నకు ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వస్తున్నారు. అదేవిధంగా వారితోపాటు విశిష్ట అతిథిలుగా రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతు న్నారు. అదేవిధంగా అతిధులుగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, మాజీ రాజ్య సభ సభ్యులు గరికపాటి రామ్మోహన రావు , బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి , రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవ రావు, పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మరియు వారితోపాటు అతిథిలుగా ప్రముఖ కవి, రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు కసిరెడ్డి వెంకట్ రెడ్డి , ఆంధ్ర భారత సామాజిక సాంస్కృతిక కళావిభాగం కన్వీనర్ అప్పల ప్రసాద్ తదితరులు హాజరు అవుతున్నారు. ఖమ్మం ఎస్.ఆర్ గార్డెన్ లో జరిగే అటల్ బిహారి వాజ్ పాయ్ శతజయంతి ఉత్సవాలలో 'అటల్ జీవి అక్షర నిర్మాణం కవితా సంకలనం' పుస్తక ఆవిష్కరణ ఉంటుంది.



అటల్ బిహారీ వాజ్ పాయ్ భారతీయ జనతా పార్టీ (బీజేపీ ) వ్యవస్థాపక నాయకుడు మరియు భారతరత్న గ్రహీత. మూడుసార్లు (1996, 1998–1999, 1999–2004) భారత ప్రధానిగా పనిచేసిన ఆయన, స్థిరమైన సంకీర్ణ ప్రభుత్వాలను నడిపి, అణు పరీక్షలు (పోఖ్రాన్–××), సవర్ణ చతుర్భుజి ప్రాజెక్టులతో దేశాభివృద్ధికి, ఆధునీకరణకు కీలక కృషి చేశారు. భారతదేశాన్ని ప్రగతిబాటలో నడిపిన మహా నాయకుడు వాజ్ పాయ్ అని, వారు చూపిన మార్గాన్ని భావితరాలకు చేరే విధంగా శతజయంతి వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తు న్నాము. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకులు మరియు అటల్ బిహారి వాజ్ పాయ్ శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి కోరారు.

# ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏదులాపురం నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, మూడో వార్డు కౌన్సిలర్ లకు సన్మానం




**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22 ( వెలుగు నిఘా )** సాయి గణేష్ నగర్ లోని ఏదులాపురం మున్సిపల్ ఛైర్మన్ క్యాంప్ ఆఫీస్ లో నూతనంగా ఎన్నికైన ఏదులాపురం మున్సిపల్ ఛైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, మూడో వార్డు కౌన్సిలర్ కొమరగిరి సత్యావతి సుమన్ లను ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాలువా లు కప్పి,బొకేలు అందచేసి సన్మానించారు. ఈసందర్భంగా ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోదాటి గిరి మాట్లాడుతూ తాము ప్రతి రోజు స్విమ్మింగ్ చేసే గురుదక్షిణ ఫౌండేషన్ మున్నేరు ప్రాంతం ఏదులాపురం మున్సి పల్ పరిధిలో ఉన్నందువల్ల గౌరవ సూచకంగా నూతనంగా ఎన్నికైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లను కలిసి సన్మానించామని, అదేవిధంగా మూడో వార్డు నుండి మా అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ మెంబర్ కొమరగిరి సుమన్ భార్య సత్యావతి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సందర్భంగా వారిని సన్మానించామని పేర్కొన్నారు. ప్రతి రోజు దాదాపు రెండు వందల మంది స్విమ్మర్లు గురుదక్షిణ ఫౌండేషన్ దగ్గర మున్నేరు లో ఈత కొడుతుంటామని, వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువ సంఖ్యలో వస్తారని దాదాపు నాలుగు వందల మంది పైగా ఉంటారని, మున్నేరు కు నిర్మిస్తున్న కరకట్ట కు రెండు వైపులా మెట్లు నిర్మించాలని ఏదులాపురం మున్సిపల్ ఛైర్మన్ ను కోరినట్లు తెలిపారు. ఈత నేర్చుకోవడానికి బాలికలు, మహిళలు కూడా వేసవిలో వస్తారని వారి సౌకర్యార్థం రెండు స్నానపు గదులు బట్టలు మార్చుకోవడానికి ప్రభుత్వం నుండి ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్నేరు స్విమ్మింగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సిరిపురపు బుజ్జి, అధ్యక్షుడు కోదాటి గిరి, ప్రధాన కార్యదర్శి మందపల్లి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొనకంచి వీరభద్రం,గౌరవ సలహాదారులు కనకం జనార్ధన్ రావు, జాయింట్ సెక్రటరీ లు షేక్ జానీమియా, బోయిన విశ్వనాధం, ఎక్జిక్యూటివ్ మెంబర్ లు కొమరగిరి సుమన్, ఏ.యన్.ఆర్.,దోనే నాగేందర్ రెడ్డి,పద్మనాభ రెడ్డి,నల్లు వెంకట్ రెడ్డి,కొలికపాక నాగేశ్వరరావు, మద్ది నాగేశ్వరరావు, పరమేష్, మోరం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు

**-వెబ్ సైట్ సమస్యలు పరిష్కరిస్తాం**
**-రామ్ నారాయణ కు హామీ ఇచ్చిన మంత్రి పొంగులేటి**
**-సమస్యలు పరిష్కరించాలని కోరిన టి యు డబ్ల్యూ జే ఐ జే యు బృందం**
**-కేబుల్ చానల్స్, చిన్న పత్రికలకు కూడా అక్రిడేషన్లు కల్పించాలని విజ్ఞప్తి**

**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22( వెలుగు నిఘా )** జర్నలిస్టు యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల అక్రిడేషన్, వెబ్ సైట్, కేబుల్ చానల్స్, చిన్న పత్రికల సమస్యలపై మంత్రి పొంగులేటి కి టియుడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ నాయకుల బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామ్ నారాయణ సారధ్యంలో ప్రత్యేకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రామ్ నారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44709 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని, తమరు ఇచ్చిన జీవో ప్రకారం చూస్తే 50% కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయని, వెబ్ సైట్ ఓపెన్ చేస్తే అందులో అడిగే ప్రశ్నలు కార్డులు ఇచ్చేలా లేవని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. వెబ్సైట్ ఫార్మేట్ సులభతరంగా లేదని ప్రస్తావించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషనర్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీ లో సభ్యులుగా తీసుకున్నారని, ప్రస్తుతం దానిని పక్కన పెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించడానినీ తప్పు పట్టారు. ఇది అత్యంత విచారకరమ న్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత జీవో ప్రకారం కలెక్టర్ అందరిని నామినేట్ చేస్తారనే ఉందని , ఇది సాధ్యం కాదని, కలెక్టర్కు కొత్త చిక్కులు తెచ్చి పెడుతుందని పేర్కొన్నారు. మా విన్నపాన్ని పరిశీలించి గతంలో అక్రిడేషన్ కమిటీలు ఏ విధంగా ఏర్పాటు చేశారో అదే సాంప్రదాయాన్ని కొనసాగిం చాలని రామ్ నారాయణ మంత్రిని కోరారు. జీవో ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ చానల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని, దీంతో ఇబ్బందులు తప్పవనే ఆందోళనతో జర్నలిస్టులు ఉన్నారని పేర్కొన్నారు. చిన్న పత్రికల వారు కూడా తమకు గతంలో మాదిరిగా కార్డులు రావని ఆందోళనలో ఉన్నారని, కేబుల్ చానల్స్ జర్నలిస్టులకు అన్యాయమే జరుగుతుందని వివరించారు. గతంలో వారు కార్డులు పొందినప్పటికీ , ఈసారి కార్డులు రావని ఆందోళన చెందుతున్నారని 20 నిమిషాల పాటు అన్ని అంశాలపై మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడేషన్ కమిటీలు ఏర్పాటు





చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. అక్రిడేషన్ వెబ్ సైట్ ను సరళీకరణ చేస్తామన్నారు. అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందని, జర్నలిస్టులు, సంఘాల నాయకులు ఆందోళన చెందరాదన్నారు. అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీయూడబ్ల్యూజే ఐజేయు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మోయినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివ, ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వేగినాటి మాధవరావు, జిల్లా నాయకులు ఏలూరు వేణుగోపాలరావు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మఠంపల్లి లో శ్రీ వేణు గోపాల స్వామి ఆలయపునఃనిర్మాణ శంకుస్థాపన, కళాపకర్షణ క్రతువు.



**హుజూర్ నగర్:ఫిబ్రవరి 22 (వెలుగు నిఘా)** మఠంపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వేణు గోపాల స్వామి ఆలయం పునఃనిర్మాణ పనుల ప్రారంభానికి శంకుస్థాపన సందర్భంగా కళాపకర్షణ క్రతువు ఆదివారం గ్రామ ప్రజల సమక్షంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరగిరినాధుని అప్పలాచార్యులు ఆధ్వర్యంలో ఈ దైవిక కార్యక్రమం జరిగింది. స్వస్తి శ్రీ చాంద్రమాన ప్రకారం విశ్వావసు నామ సంవత్సరం, ఫాల్గుణ శుద్ధ పంచమి, అశ్విని నక్షత్ర యుక్త మేష లగ్న సుముహూర్తమైన ఉదయం 10:26 గంటలకు దైవజ్ఞులు నిర్ణయించిన ముహూర్తం మేరకు, ఉదయం 8 గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఆలయ ప్రధాన గోపుర శిఖర కలశాన్ని విధివిధానాలతో తొలగించి, మట్టి కుండలో ఆవాహనం చేసి గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఆగమ ధర్మశాస్త్ర నియమాలను అనుసరించి కళాపకర్షణ క్రతువును శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ పురోహితులు శాండిల్య, అర్చకులు అరవింద్, కనకదుర్గమ్మ ఆలయ పూజారి సూర్యనారాయణ మూర్తి వేద మంత్రోచ్చారణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజల సమక్షంలో జరిగిన ఈ యజ్ఞ కార్యక్రమం లో పాల్గొని స్వామి వారి భక్తులు పునః నిర్మాణం కోసం ఇటుకలు అందించి పనులు ప్రారంభం చేశారు. ఈ పనులు విజయవంతంగా నిర్వహించాలని భక్తుల విరాళాలు అందించుటకు ముందుకు వచ్చారు. కార్యక్రమం అనంతరం క్రతువు లో భాగస్వామ్యులు అయిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. షుమారు కోటి రూపాయల అంచనా తో పునః నిర్మాణ పనులు జరుగుతున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

# విస్మరించకు తెలుగు, వికసింపజేద్దాం తెలుగు భాష

**- మాతృభాష దినోత్సవం సందర్భంగా కవి కార్ల శ్రీనివాస్ కు ఘన సన్మానం**



**హుజూర్ నగర్: ఫిబ్రవరి 22 (వెలుగు నిఘా)** ప్రపంచ తెలుగు కవుల మహాసభలు విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా జరిగాయి. ఈ సభలకు ముఖ్య అతిథిగా హాజరైన భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మాతృభాష శ్వాస లాంటిదని తెలుగు భాష ను ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యులు అందరూ కాపాడాలని చదవాలని మాట్లాడాలని కోరారు .మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగును విస్మరించ వద్దని వికసింపజేద్దాం తెలుగు భాష ను మాతృభాష ను కాపాడుకుందామని మఠంపల్లి గ్రామ స్పందన సాహిత్య కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కవి గాయకుడు కర్ల శ్రీనివాస్ తెలిపారు . విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ తెలుగు కవుల మహాసభలలో కవిగా ,గాయకుడిగా గుర్తించి షీల్డ్ శాలువా సర్టిఫికెట్ బహుకరించి ఘనంగా సన్మానించారు. పొట్లూరి హరికృష్ణ ఆంధ్రప్రదేశ్ పూర్వ జానపద అకాడమీ అధ్యక్షులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల కవులు కళాకారులుహాజరయ్యారు .అందరిని ఘనంగా సన్మానించి తెలుగు భాష ను మర్చిపోవద్దని తెలుగు సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలని వక్తలు కోరారు. ఈ సందర్భంగా కవి గాయకుడు శ్రీనివాస్ కు పలువురు అభినందనలు తెలిపారు.

## ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల యొక్క ప్రధాన సమస్య రెగ్యులరేషన్ పై మంత్రి పొంగిలేటి కీ వినతి పత్రం అందచేత



**ఖమ్మం ప్రతినిధి ఫిబ్రవరి 22 ( వెలుగు నిఘా )**ఎన్ హెచ్ ఎం జేఏసీ ఖమ్మం జిల్లా పక్షాన రాష్ట్ర రెవిన్యూ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి అయితే ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల యొక్క ప్రధాన సమస్య రెగ్యులరేషన్ పై వినతి పత్రం అందించడం జరిగింది.
వెంటనే మంత్రి స్పందించి క్యాబినెట్ సమావేశంలో చర్చించి బడ్జెట్ పై పూర్తి సమాచారం తీసుకుని రెగ్యులరైజేషన్ కి అవకాశం కల్పిస్తామని పూర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ఎన్ సందీప్, జిల్లా కోఆర్డినేటర్ సురేష్, డాక్టర్ దొడ్డ మాధవి, శ్రావణ్, డాక్టర్ వెంకట్ లాల్, హరీష్,రాంప్రసాద్,విజయ్ కుమారి,రాజేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.